# కొసరు బేరాలు

"ఏబులం వంకాయలుకొన్నా. ఒక బీరకాయ కొసరియ్యి-లేకపోతే ఈ వంకాయలు పట్టుకుపో !"

"కొసరులేని బేరం ఎక్కడా చూళ్ళేదు - వేయి - ఓకాయ కొసరియ్యి ! తక్కెడ అటుపోతూంది - వెయ్యాలి ఓకాయ-"

"నువ్వు చెప్పిన ధరకి కొంటున్నా- కొసరేనా లేకపోతే ఇంకెందుకొచ్చిన బేరం - ఓ కాయ పడెయ్యి-"

"నిన్న వంకాయలమ్మి రెండు కాయలు కొసరేసింది. నేను ఎవళ్ళ దగ్గరకొన్నా కొసరులేందే కొనను - రెండుకాయలు కొసరు వెయ్యకపోతే నా కొద్దు ఈ బేరం-"

ఇట్లాంటి కబుర్లు తరుచుగా ఇంటి గుమ్మాలముందర వినబడుతూంటాయి - గృహిణికీ కూరగాయలమ్మే వాడికీ మధ్య ఏర్పడే చిలిపి తగువును సూచిస్తాయి ఈ మాటలు.

ఉంది! ఆడవాళ్ళందరిలోనూ-ఏ కొద్దిమందిలోనో తప్ప- ఈ గుణం -వుంది - వంకాయకొని గుమ్మడికాయ కొసరు అడిగేగుణం.!

ఈ విధమైన స్వభావం సాధారణపు ఆడవాళ్ళందరి దగ్గరా వుంటుందని మీకూ నాకూ తెలియకపోవచ్చును. కాని, కూరలమ్మేవాడికి బాగా తెలుసును.

ఇంటి గుమ్మాలవద్దకు కూరలు అమ్మ తెచ్చేవాడు తన బ్రతుకు తెరువుకోసం పాటుపడుతున్నాడు. సరదాగా వచ్చి కూరలు మీ వళ్ళో పోసి చిత్తిన గుడ్డ వేసుకుని వెళ్ళడంకాదు అతడి ఆశయం.

కొంత ఖరీదుకు ఎక్కడో కొన్ని కూరలు కొనితెచ్చి, వీధులూ, వాడలూ అన్నీ తిరిగిమోస్తూ, వాటిని ఎవరికికావాలో వారికి తన తిరుగుడు కూలి, శ్రమ వీటికి ప్రతిఫలం కిట్టుబాటయ్యే రేటుకి - అంటే, కొంచం లాభానికి - అమ్ముకొని ఆ లాభంతో తను పొట్టపోసుకోవడం అతడి ఆశయం - అతడివద్ద కొసరు అడిగే అమ్మలక్కలకు ఈ సంగతి తెలుసునా? ఊహు! యాదాలాభంగా వచ్చి కొన్నధరకే యిచ్చి, పై పెచ్చు కొసరుకూడా యిచ్చి అతను అన్నివిధాలా మట్టమై పోవాలని వారి వూహ.

కూరలవాడిమీద గృహిణిజులుం సాగించడంలో కూడా కారణంలేక పోలేదు - పాయింటులేక పోలేదు - అంటారు కొందరు. అదేమిటయ్యా అంటే, బజార్లో వీశ అణాకు అమ్మే వంకాయలు తెచ్చి అతడు తనకు వీశ రెండణాలకు అంటగట్టి పోవడం! బజారునుండి తెచ్చి తనకు కూరలు సరఫరా చెయ్యడానికి నూటికి నూరుపాళ్లు లాభం కావాలా అని ముక్కుమీద వేలు వేసుకుంటుంది. ఈ విధంగా, కూరలవాడు తనను దగా చేస్తున్నాడనే అభిప్రాయంలో స్థిరపడిపోయి ఎంత సరసమైన ధరకు అమ్మే కూరలవాడినైనా సరే ఆమె అనుమానంతో చూస్తుంది - మోసగిస్తున్నాడని భావిస్తుంది. ఫలితం: వీశ రెండణాలు చెబితే అణాకు ఇమ్మంటుంది!

ఇంక కూరలవాడి విషయం: ఈ అమ్మలక్కల సమాచారం అతడికి బాగా తెలుసునని ముందే అనుకున్నాం. తను చెప్పిన ధరకు సగం తగ్గించి అడుగుతారనీ, పైపెచ్చు వీశకు ఏబులంకాయలు కొసరు అడుగుతారనీ అతడికి బాగా తెలుసును. కాగా, ప్రతి గృహిణినీ, - ఎంత న్యాయమైన గృహిణినికూడా అతడు అనుమానించి, తన నోటిముందర అన్నం పడగొట్టడమే ఆవిడవృత్తి అని భావించి, ఎలాగా తను చెప్పిన ధరకు సగాని సగం తగ్గించి అడుగుతుందని స్థిరం చేసుకుని వీశ అణాకు అమ్మితే తనకు కిట్టుబాటయ్యే కూరలను వీశ బేడ అంటాడు; ఒక్కొక్క యిల్లాలిని చూస్తే మూడణాలనికూడా అంటాడు!

ఈ తప్పులతక్కెడ వ్యాపారం నశించాలంటే, కూరలవాడి మధ్య గృహిణి మధ్య గల అనుమానాలూ, ఒకరిపైన ఒకరికి గల అపనమ్మకాలూ నశించాలి. ఇద్దరిమధ్య కూడా ఇప్పటికంటే ఎంతో విశిష్టభావం ఏర్పడాలి. కూరలవాడు తన బ్రతుకు తెరువుకోసం కూరలమ్ముకుంటున్నాడనీ, వాడి నోటిముందర ఆహారం చెడగొట్టకూడదనీ గృహిణి తెలుసుకోవాలి. గృహిణులంతా కూడా తనను పోషించడానికి కాకుండా తమ ఆకళ్ళను తీర్చుకుందుకు తనవద్ద కూరలుకొంటున్నారనీ తనను నమ్మి వారు తనదగ్గర కొంటూన్నందుకు వారిని మోసంచేయకూడదని కూరలవాళ్ళూ తెలుసుకోవాలి. అన్నిటికన్న ముఖ్యం వంకాయకొని గుమ్మడికాయ కొసరిమ్మంటే కూరలవాడు మట్టమైపోతాడని ప్రతి గృహిణీ గ్రహించుకుని ఆ దురన్యాయపుబుద్ధిని మళ్ళించుకోవాలి!